# 10

# ఉప్పు మరియు వెలుగు

## (5:13-16)

ఆయన ఉపదేశించుచుండిన కొండ మీద ప్రసంగమును యేసు కొనసాగించుచు, ఆయన శిష్యులు "ఉప్పు" మరియు "వెలుగై" యుండవలెనని ఆజ్ఞాపించాడు. వారి చుట్టూర నున్న ప్రపంచాన్ని సాధ్యమైనంత ఎక్కువ ప్రభావితంచేయు విధంగా వారు జీవించవలెనని ఆయన ఆశించాడు. రాజును పోలి రమణీయముగా నడుచుకొనుట ద్వారా వారు రాజ్య సువర్తమానమును ప్రతిబింబించవలెనని ఆయన వారిని సవాలు చేశాడు.

### లోకమునకు ఉప్పు (5:13)

**13మీరు లోకమునకు ఉప్పయి యున్నారు. ఉప్పు నిస్సారమైతే, అది దేనివలన సారము పొందును? అది బయట పారవేయబడి మనుష్యులచేత త్రొక్కబడుటకే గాని మరి దేనికిని పనికిరాదు.**

**వచనము 13. "మీరు లోకమునకు ఉప్పయి యున్నారని"** యేసు చెప్పెను. ప్రాచీన కాలము నాటి ప్రజలు ఉప్పును ఆహారము రుచికరంగా ఉండునట్లు దానికి తాలింపువేయుట కంటే యింకా ఎక్కువ ఇతరమైన ప్రయోజనాల నిమిత్తము ఉపయోగించారు (యోబు 6:6; కొలస్సయులకు 4:6). యేసు ఉపదేశములను వినుచుండినవారికి ఆహారపదార్థములు పాడవకుండా వాటిని భద్రముగా నిలువ ఉంచుటకు శీతలీకరణ యంత్రములు లేక ఇతర ఆధునిక పద్ధతులు లేనందునుబట్టి, వారు ఉప్పును పరిరక్షించు పదార్థముగా ఉపయోగించారు. ఉదా॥ గలిలయ సముద్రములో చేపలు పట్టిన పిమ్మట, అవి తరుచుగా ఉప్పుచేత నిల్వచేయబడుచు వ్యాపారము నిమిత్తము ఇతర చోట్లకు రవాణాచేయబడినవి. ఉప్పు అసంఖ్యాకమైన ఔషధీయ ప్రయోజనాల విషయములో కూడ వాడబడినది. వైద్యశాస్త్రములో ఉప్పు శుభ్రపరచు సాధనముగ వినియోగింపబడినదని ప్లిని ది ఎల్డర్ చెప్పాడు. అది పాము కాటు వేసినప్పుడు మరియు కందిరీగలు కుట్టినప్పుడు చికిత్సచేయుటకు ఉపయోగింపబడినది. కంటి కాటుక తయారిలో ఒక అంశమై యుండినది మరియు గాయములు కట్టుటకు ఉపయోగింపబడినది. పిప్పిపళ్లను నిరోధించుటకు కడుపులో నున్న క్రిమికీటకములు విసర్జన గావింపబడునట్లు చేయుటకును ఉప్పు ప్రయోజనకరమైనదై యుండినది.[1]

ఉప్పు దైవికమైన లక్షణమును కలిగియున్నదని గ్రీకులు నమ్మారు, మరియు రోమనులు వారి సైనికులకు వేతనముగా చెల్లించుటకు ఉప్పును తరుచుగా ఉపయోగించారు. వాస్తవమునకు, "అతడు, తాను సంపాదించు దానికి తగినవాడు" అను నానుడి పుట్టింది. దీని మూలముననే ఉప్పు "మానవుని మౌలిక అవసరములలో ఒకటిగా" ఎంచబడింది.[2] "ఉప్పు వలన ప్రజలు పొందు మేళ్లను పొగడిన తదుపరి, శరీరమంతటికిని ఉప్పు మరియు సూర్యరశ్మి ప్రయోజనకరమైనంతగా మరేదియు కాదను విషయంలో ఈ నానుడి ముఖ్యముగా

వర్తించుచున్నదని" ప్లిని రచించాడు.[3] ఉప్పును మితిమీరి సేవించుట మన ఆరోగ్యనికి అది హనికరమైనది కాగలదు, అయితే కొంత నిశ్చిత మోతాదులో తీసికొనినప్పుడు అది మన శరీరంలోని ద్రవములను సమతుల్యముగా నుంచుటకు అత్యంత ప్రయోజనకరమైనదగును.

ఆయన శిష్యులు లోకమును ప్రభావితము చేయునట్లు శక్తిమంతులై యుండవలెనని వారిని ప్రేరేపించుటకు యేసు ఉప్పును గూర్చిన రూపకాలంకారమును ఉపయోగించాడు – అది ఆహారమునకు రుచినిచ్చును, ఆహారమును భద్రముగా నిల్వఉంచుటకు ఉపయోగపడును, మరియు స్వస్థత కలుగజేయు శక్తి కలిగియున్నది. లియోన్ మోర్రిస్ ఇలా రాయుచున్నాడు,

> ఉప్పు ఒక పరిరక్షించు పదార్థముగాను, పదార్థములు కుళ్లిపోకుండా భద్రముగా కాపాడు యోధుడుగాను, ఆహారమునకు రుచినిచ్చునదిగాను ఉండుట గూర్చి యేసు ఆలోచించుచుండెనని స్పష్టమగుచున్నది. సమాజమునకు శ్రేయస్కరమైనది సంపూర్ణమైనదిగా ఉండునట్లు ఆయన అనుచరులు దానిని కాపాడుచుందురు. అవినీతిని వారు వ్యతిరేకించుదురు; వారు సమాజ శ్రేయస్సు నిమిత్తము దానిలోనికి చొచ్చుకొనిపోయి నైతిక క్రిమినివారకముగా పనులు చేయుచుందురు. ఆహారపానీయాదులకు ఉప్పు ఆస్వాదించదగు రుచినిచ్చు చందమున వారు జీవితమునకు ఆశీర్వాదకరమగు ఘాటును కలుగజేయుదురు.[4]

ఉప్పు ఒక ప్రాచీన ఎరువుగా కూడ ఉపయోగింపబడింది (లూకా 14:34, 35). పొలములో మితిమీరి చల్లబడిన ఉప్పు ఆ పొలాన్ని పాడుచేస్తుంది (ద్వితీయోపదేశకాండము 29:23; న్యాయాధిపతులు 9:45), కానీ అదే ఉప్పు చిన్న మొత్తములో చల్లబడినప్పుడు అది విత్తనముల ఎదుగుదలను పెంచుతోంది, తత్ఫలితంగా ఫలసాయం సమృద్ధిగా ఉత్పన్నమగుటకు తోడ్పడుతొంది. అదే విధంగా, యేసు శిష్యుల విచిత్రమైన ప్రభావము ఒక ఎరువుగా పనిచేస్తుంది, రాజ్య సువర్తమానము దాని సంపూర్ణ సార్థకతను సాధించునట్లు తోడ్పడుతుంది.

**"ఉప్పు నిస్సారమైతే, అది దేనివలన సారము పొందును?"** అని కూడ యేసు పలికాడు. రసాయనికంగా, ఉప్పు సోడియం క్లోరైడ్ అయియున్నది, గనుక హేతువునుబట్టి అది లావణ్యమును కొల్పోదు. ఏదిఏమైనా, యేసు రోజుల్లో ఉత్పత్తిచేయబడుచుండిన ఉప్పులన్ని అధిక శాతం సముద్రపు నీరు ఆవిరియగునట్లు పాటింపబడిన పద్ధతి చొప్పున తయారుచేయబడుచుండినది. మృత సముద్రపుటుప్పు, సాధారణ ఉప్పు కలిగియుండు అంశములతో పాటుగా, అనేక ఇతర రసాయనములు మరియు ఖనిజములు కలిగియుండును. ఉప్పును తయారుచేయువారు సముద్రము నీటి నుండి సాధ్యమైనంత ఎక్కువ మంచి ఉప్పును ఉత్పత్తిచేయుటకే ప్రయాసపడుదురు; ఇది కుప్పలు కుప్పలుగా కూర్చబడి, అమ్మకమునకు సిద్ధంగా ఉండును. కూర్చబడిన ఈ కుప్పలపై వర్షము కురిసినట్లయితే, ఉప్పు నీరుగారిపోయి, చివరకు గట్టిబడినదియు, నిరుపయోగకరమునైన పదార్థము మిగులుతొంది. ఇటువంటి ఉప్పు **వీధుల్లో పారవేయబడీ** దారినవెళ్లే **మనుష్యులందరిచేత త్రొక్కబడుటకే** పనికివస్తుంది. ఇదే, విధంగా, ఒక క్రైస్తవ విశ్వాసి అతడు కలిగియుండు రక్షించు ప్రభావమునుకొల్పోయినప్పుడు, క్రీస్తు కొరకు అతడు నిరుపయోగమైనవాడౌతాడు.

## లోకమునకు వెలుగు (5:14-16)

**14మీరు లోకమునకు వెలుగైయున్నారు; కొండమీదనుండు పట్టణము మరుగైయుండనేరదు.
15మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రింద పెట్టరు కాని అది యింటనుండువారికందరికి
వెలుగిచ్చుటకై దీపస్తంభముమీదనే పెట్టుదురు. 16మనుష్యులు మీ సత్క్రియలను
చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారియెదుట మీ వెలుగు
ప్రకాశింపనియ్యుడి.**

**వచనము 14. "మీరు లోకమునకు వెలుగై యున్నారని"** చెప్పుచు యేసు తన ఉపదేశమును కొనసాగించాడు. లేఖనములలో, "వెలుగు" తరుచుగా సత్యము, పవిత్రత, మరియు నీతికి ఒక చిహ్నమై యున్నది. దీనికి తారతమ్యముగా, "అంధకారము" అజ్ఞానమునకు మరియు దుష్టత్వమునకు ఒక చిహ్నమై యున్నది (కీర్తనలు 119:105; యోహాను 1:4-9; 3:19-21; 2 పేతురు 1:19; 1 యోహాను 1:5-7). పాత నిబంధన యుగములో, ఇశ్రాయేలు జనాంగము అన్యజనాంగము అన్య జనులకు వెలుగై యుండవలెనని దేవుడు ఆశించాడు (యెషయా 42:6, 7; 49:6), కానీ ఈ పనిలో వారు తరుచుగా విఫలులయ్యారు. యేసు ఎన్నుకొనిన దాసుని పాత్ర ఆయనను వెంబడించుచుండినవారికి అది అందజేయబడింది.[5] యేసు "లోకమునకు వెలుగై యున్నాడు" (యోహాను 8:12; 9:5), గనుక ఆయన అనుచరులు కూడ "లోకమునకు జ్యోతులవలె కనబడుచున్నారని" ఆయన సెలవిచ్చాడు (ఫిలిప్పీయులకు 2:16 చూడుము). అనగా, ఆయన నుండి వారు పొందిన వెలుగును ఆయన దాసులు సహితము ప్రతిబింబించవలసియున్నదని మరొక మాటలో చెప్పుకొనవచ్చును (ఎఫెసీయులకు 5:6-14). లోకమును ముంచెత్తియున్న ఆధ్యాత్మిక అంధకారము నుండి అది వెలుపలకి రాగలుగునట్లు దారి చూపింపబడుటకు దానికి సత్యమను వెలుగు అత్యావశ్యమై యున్నది.

**"కొండ మీద నుండు పట్టణము మరుగైయుండనేరదని"** చెప్పుట ద్వారా, వెలుగును గూర్చి ఆయన తెలియజెప్పుచుండిన అలంకార అన్వయమును యేసు ఉదాహరణంగా వివరించాడు. సాధ్యమైనప్పుడెల్లా, అనేక కారణములను బట్టి పట్టణములు కొండల మీద మరియు కొండల ప్రక్కల నిర్మింపబడినవి. ఇటువంటి ఒక చోటు ప్రయోగాత్మకమైన ప్రాముఖ్యతను కలిగియుండినది. ఈ కొండల చుట్టూర నున్న చదునైన భూములు పశుసంపదను మరియు పంటపొలములలో సమృద్ధియైన ఫలసాయమును అభివృద్ధిచేసికొనుటకు అది అనుకూలతను కలుగజేయుచుండినది. ఈ చోటు వాతావరణమునకు కూడ సంబంధించినదై యుండినది. ఎత్తైన ఉన్నతాంశములలో నివసించుట వలన అచ్చట నివాసముండిన వారికి ఉక్కపోతగా నుండు మండుటెండల రాత్రుల్లో నిర్జలమైన నేల మీదుగా సముద్రపు గాలులు వీచుచుండినప్పుడు చల్లనిదనాన్నిచ్చుచుండినది. పర్వతముల ప్రక్కలు సైనికపరంగా గొప్ప సానుకూలమైన స్థావరాలుగా సహకరించాయి. పర్వతముల ఉన్నతాంశములు శత్రువుల దాడుల నుండి కాపాడుకొనుటకు స్వాభావికమైన కాపాలా బుజువులను సమకూర్చాయి. ఇంతేగాక, అవి ఉన్నరీతినే, కొండల ప్రక్కన కట్టబడిన పట్టణములు వెలుగుమయమై రాత్రుల్లో అలసి సొలసియుండు ప్రయాణికులకు పథ ప్రదర్శకములై యుండినవి, ఏలయనగా ఈ పట్టణములు అనేక దూరము వరకు కనబడుచుండినవి.

యేసు ప్రభువు ఈ ఘోషణ చేసినప్పుడు, ఆయన చుట్టూర ఒక "కొండ" లేక

"పర్వతము" మీద జనసమూహము కూడుకొనియుండినది (5:1). అనేకులై యుండిన ఈ శిష్యబృందము "కొండ మీద నుండు పట్టణమై" ఉండవలసి యుండినది. నేడు సహితము గలిలయ సముద్రమును సందర్శించువారు ఈ కొండల చుట్టుప్రక్కల నిర్మింపబడి రాత్రులందు వాటి వెలుగు కిరణములను సముద్ర తీరము వెంబడి ప్రసరింపజేయుచుండు ఎన్నో పట్టణములనుబట్టి ముగ్ధులౌచుందురు.

**వచనము 15.** యేసు ఒక పట్టణమంతయు విరజిమ్ము వెలుగును గూర్చి ఆయన తెలియజెప్పిన పెద్ద చిత్రీకరణమును ఒక్క ఇంటిలో నుండు వెలుగుతో అమలు పర్చాడు. ఎవరైనాగాని **ఒక దీపమును వెలిగించిన** తరువాత అది **కుంచము క్రింద** ఉంచబడినట్లు కనుగొనుట నిజముగా అరుదైన అంశమై యుండునని ఆయన సెలవిచ్చాడు (లూకా 8:16; 11:33; మార్కు 4:21 చూడుము). మొదటి శతాబ్దము నాటి ప్రజలు రాత్రులందు వారి ఇళ్లలో వెలుగుండునట్లు నూనెతో మండుచుండిన చిన్న చిన్న దీపములను ఉపయోగించారు. దీపమును కప్పుచున్నట్లుగా ఒక కుంచమును దానిపై నుంచుట దీపము యొక్క ఉద్దేశమునే విఫలము చేయును మరియు దాని కాంతిని అది ఆర్పివేయును – ఇదొక నాశన చిహ్నమై యున్నది (యోబు 18:5, 6; 21:17; సామెతలు 13:9; 20:20; 24:20; 31:10, 18). దానికి బదులుగా, ఆ దీపము **దీపస్తంభము మీదనే,** ఇంటి గొడలో నుండి కొంచము బయటికి పొడుచుకొని యుండు రాతి మీద లేదా కర్రతో చేయబడి ఇంటికి మధ్యగా నుండు దూలమునకు చేర్చబడిన ఒక అలమారు మీద పెట్టబడును. అప్పుడు, ఆ దీపము **ఇంటిలో నుండు వారందరికిని వెలుగునిచ్చును.** ఇది దాని బుల్లి వెలుగు కిరణములను విరజిమ్ముచుండిన ఒక చిన్న దీపమే అయియుండవచ్చును, కానీ దానిని దీపస్తంభము మీద పెట్టుట వలన అది దాని గరిష్ట పరిమితి వరకు ప్రకాశించుచుండును. "యూదుల ఇళ్లు తరుచుగా సామాన్యమైన ఒక గది గల కట్టడములై యుండినవి గనుక, ఒక ఎత్తైన చోట ఉంచబడిన ఇటువంటి దీపము ఇంటిలో నున్న ప్రతి ఒక్కరికిని దాని వెలుగునిచ్చినది."[6]

**వచనము 16.** యేసు నియమమును చెప్పి (5:14), ఆ నియమమునకు సంబంధించిన రెండు సోదాహరణములను ఇచ్చిన తరువాత (15:14, 15), ఈ సత్యమును తన శిష్యులకు అన్వయించాడు. **"మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడని"** ఆయన సెలవిచ్చాడు. క్రీస్తు అనుచరులు ఇతరుల సావధానమును తమ కొరకు ఆకర్షింపకూడదు; కానీ దానికి బదులుగా, వారి చుట్టూర నున్న ప్రజలందరికి క్రీస్తును ఆకర్షితునిగా ప్రదర్శించవలెను. "సౌందర్యమైనది," "ప్రయోజనమైనకరమైనది," మరియు "పొగడదగినదైయున్న" దానిని వర్ణించుటకు "సత్" అను మాటకు సమానార్థమిచ్చు గ్రీకు పదము వాడబడినది. "మహిమపరచునట్లు" అనగా, "ప్రశంసించుట," "పొగడుట" లేదా "స్తుతించుట" యని అర్థము. ఆంగ్ల పదము డాక్సాలజి (doxology; స్తుతి గీతము) ఉత్పన్నమైనది ఈ పదము నుండియే. క్రైస్తవ విశ్వాసి యొక్క సత్రియలు ఇతరులను దేవుడు మరియు ఆయన కుమారుని వైపుగా మళ్లించవలెను, దీనంతటినిబట్టి దేవుడు స్తుతింపబడును (ఎఫెసీయులకు 2:10; 1 పేతురు 2:12 చూడుము). జే. డబ్ల్యు. మెక్‌గార్వే ఇలా వివరించుచున్నాడు, "వెలుగు ఈ లోకములో నుండి చీకటిని పారదొలి మనుష్యులు ఎలా పయనించాలి, ఎలా పనులు చేయాలో చూడగలుగునట్లు వారికి తోడ్పడుచున్నట్లుగానే, శిష్యులు కూడా, వారి సత్క్రియలు,

వారి బోధనలు, మరియు వారి మాదిరికరమైన జీవితము ద్వారా, అజ్ఞానమును మరియు ఇతరుల యెడల గల ప్రతికూలాభిప్రాయమును పారదోలి, మనుష్యులు నిత్య జీవమునకు వెళ్లగల మార్గమును చూడగలుగునట్లు వారికి సమర్థతను కలుగజేయవలెను."[7]

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

## ఉప్పు (5:13)

మనము "ఇహలోకము లోని మంచి గూర్చి ఏమియు పట్టించుకొనకుండునంతగా ఇతర లోకము గూర్చి చింతలో అతిగా మునిగిపోయి యున్నామని" క్రైస్తవులకు విరోధముగా ఆరోపింపబడుచున్నది. మన కళ్లతో మనము మన కాళ్ల క్రింద నున్న నేలను చూడలేకుండునట్లు మన తలలు ఆకాశమందలి నీలి మేఘాల్లో ఎంతో ఎత్తులో ఉన్నవని చెప్పుకొనుట లేదా వ్యాఖ్యానింపబడుట సాధ్యమేనా? మనము ఈ లోకములో మామూలుగా జీవించుచున్నామా, లేకా పరలోక రాజ్య పౌరులముగా జీవించుచున్నామా? ఈ రెండింటిలో ఇది ఏదియు లేక ఏ పరిస్థితియు కాదు.

యేసు సిలువవేయబడక మునుపు ఆయన చేసిన ప్రార్థనలో, ఆయన శిష్యులు "లోకములో ఉన్నారు" కానీ "లోక సంబంధులుకారని" ఆయన పలికాడు (యోహాను 17:11, 16). క్రీస్తు యేసును సేవింపవలెనను సదుద్దేశముతో ఒక క్రైస్తవ విశ్వాసి ఈ లోకములో జీవించినప్పుడు, అదొక సద్విషయమౌతొంది. కానీ ఈ లోకమే వానిలో ఉన్నప్పుడు, అదొక చెడు విషయమౌతొంది (యాకోబు 4:4; 1 యోహాను 2:15-17). ఆయనను వెంబడించుచుండినవారు ఈ లోకములో నుండి తీసికొనిపోబడవలెనని ఆయన ప్రార్థించలేదు, కాని వారు ఈ లోకములో దేవుని ఉద్దేశమును నెరవేర్చు నిమిత్తమై జీవించుచుండగా వారు సాతాను నుండి కాపాడబడవలెనని వారి కొరకు ప్రార్థించాడు (యోహాను 17:15, 18). ఆ ఉద్దేశము, ఈ బోధనలో తెలియజెప్పబడినట్లుగా, లోకమును దైవభక్తితో ముంచెత్తుటయై యున్నది.

క్రైస్తవులమైన మనము, భోజనము కమ్మని రుచినిచ్చునట్లు ఉప్పును చల్లుకొనుటకు ఉపయోగింపబడు చిన్న డబ్బాలమై, మన చుట్టూర నున్న వారికి క్రీస్తు యొక్క కమ్మని పరిమళమును పంచుకొనుచుండవలెను. మనము ఆధ్యాత్మిక సత్తువ లేకుండా, రుచిలేనివారముగాను, మందకొడిగాను, మరియు నిర్జీవులముగాను ఉండకూడదు. మనము అందరిలో కొట్టవచ్చినట్లు కనబడాలే గాని, వారిలో కలిసిపోయినవారమై యుండకూడదు. మనము భిన్నమైనవారముగా ఉండుట మాత్రమే కాదు, కానీ ఇతరులలో భిన్నత్వముగల మార్పు కలుగజేయువారమై యుండవలెను. మనము లోకమునకు ఉప్పయి యుండవలెనని యేసు మనలను పిలుచాడు, పంచదారయై యుండుటకు కాదు. ఉప్పు మంట పుట్టించవచ్చును, కానీ అది మంచిని మంచిగా పరిరక్షించటకు కూడా పనికివచ్చును. మనలో నున్న "ఉప్పుతనమును" మనము కొల్పోయినట్లయితే, యిక మీదట యేసు కొరకు ఏవిధముగాను ప్రయోజకులమై యుండము.

## వెలుగు (5:14–16)

దేవుడు "భూమ్యాకాశములను" సృజించిన తరువాత, మరియు "భూమి నిరాకారముగాను శూన్యముగాను ఉండినప్పుడు," ఆయన వెలుగును సృజించాడు, అది సమస్త జీవరాశికి అగత్యమైయున్నది (ఆదికాండము 1:1–3). వెలుగు అనాదిగా రక్షణతో ముడిపడియున్న అంశమై యున్నది. వెలుతురు మనకు మార్గనిర్దేశకముగాను మన నిరీక్షణకు సంకేతముగాను ఉండునట్లు మనము మన ఇంటి కిటికిలలో దానిని ఏర్పాటుచేసికొందుము. ఓడ రేవులలో ఏర్పాటుచేయబడియుండు ఎత్తైన దీపస్తంభములు నేటికిని ఓడలు మోసపూరితమైన సముద్రము మరియు అపాయకరమైన అడ్డంకులకు దూరముగా పయనించునట్లు వాటి గూర్చి హెచ్చరించుచున్నవి. ఇతరులకు సత్యమును వెలుగు గూర్చి సరైన మార్గనిర్దేశనము నిచ్చుటకు క్రైస్తవులు లోకములో జ్యోతులై యుండవలెను. మన దీపములు ఆరిపోయియున్నట్లయితే, లేక మనము వాటిని "మంచము" క్రిందనో "కుంచము" క్రిందనో పెట్టినట్లయితే, అనేకులు ఈ లోకాంధకారములో గుడ్డిగా తడుములాడుకొనుచు దారి తప్పి నశించిపోవుదురు. క్రైస్తవ విశ్వాసులు వ్యక్తిగతముగా "లోకమునకు వెలుగైయున్నారని" యేసు చెప్పాడంటే, క్రైస్తవ సంఘ సమూహములు వారు నివసించు ప్రతి సమాజములోను మార్గము చూపించు పథప్రదర్శకములై యున్నారు. మత్తయి 5:14–16లో చెప్పబడినవి వ్యక్తిగతముగా వర్తించునవై యున్నప్పటికిని అవి సంఘ సమూహములకు సహితము సరిసమానంగా వర్తించు సత్యములై యున్నవి.

## లోకమునకు వెలుగు (5:14–16)

మనము నివసించుచున్న లోకము ఆధ్యాత్మిక అంధకారములో అలుముకొనబడి యున్నది. ఏది ఏమైనా, వెలుగు చీకటిని పారదోలుతుంది. ఎవరైనను ఎప్పుడైనను వెలుగు చీకటితో ఆర్పివేయలేదు. వెలుగు ప్రవేశింపగానే, చీకటి పారిపోతుంది. క్రైస్తవులమైన మనము, ఇతరులకు సత్యమును వెలుగు దిశగా సరైన మార్గనిర్దేశనమిచ్చునట్లు మన వెలుగును ప్రకాశింపనియ్యవలెను. అనగా ఇది మనము సామాన్యముగా మన కంఠహారములో ధరించు సిలువను మించినదై యున్నదని అర్థమగుచున్నది. క్రీస్తు మనలో నివసించుచున్నాడని ఇతరులు చూడగలుగునట్లుగా మనము జీవించుట అందుకు అగత్యమై యున్నది (యోహాను 13:35; 15:8; 2 కొరింథీయులకు 8:21; ఫిలిప్పీయులకు 2:14–16; తీతు 2:7, 8; 1 పేతురు 2:12). మెక్ఆర్థర్ ఇలా వ్యాఖ్యానించుచున్నాడు, "ఇతరుల మనస్సును గాయపర్చుదుమేమో అను భయమునుబట్టి, ఉదాసీనత మరియు అనురాగరహితులమైనందునుబట్టి, లేదా ఇతరమైన ఏ హేతువునుబట్టియైనను, మనము మన వెలుగును దాచి పెట్టినను, మనము ప్రభువు యెడల మన విశ్వాసఘాతకమును ప్రదర్శించుచున్నవారమౌదుము."[8]

---

సూచనలు

[1]Pliny *Natural History* 31.45. [2]Sirach 39:26 (NRSV). [3]Pliny *Natural History* 31.45. [4]Leon Morris, *The Gospel According to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 104. [5]Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 42. [6]Micheal J. Wilkins, "Mat-

thew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 36. [7]J. W. McGarvey, *The New Testament Commentary*, vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 51. [8]MacArthur, 246.